క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కోట వీధిలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గ్రామ సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం శివస్వాములకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, కృష్ణప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు: పట్టణంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. 5 , 6వ వార్డు సచివాలయాల పరిధిలోని సంజీవయ్యనగర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తారన్నారు.

విద్యార్థుల వివరాలను పంపండి

సి.బెళగల్: గ్రామ వలంటీర్ల లాగిన్‌లో ఉండే ఇంటర్, పదో తరగతి విద్యార్థుల వివరాలను వీఆర్వోల లాగిన్‌లకు పంపాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..మండలంలోని చదువుకునే విద్యార్థులకు ఉచితంగా కుల, ఆదాయ ధ్రువపత్రాల పంపిణీలో భాగంగా వలంటీర్ల లాగిన్‌లలో ప్రభుత్వం 1,213 మంది వివరాలను అప్‌లోడ్ చేసిందని, వాటిని వలంటీర్లు పరిశీలించి సంబంధిత అర్హత పత్రాలను జత చేసి వీఆర్వోల లాగిన్‌లకు పంపాలని ఆయన సూచించారు. తర్వాత వీఆర్వోలు, ఆర్‌ఐ, తహసీల్దార్ లాగిన్‌లలో పరిశీలన చేసి విద్యార్థులకు ఉచితంగా కుల, ఆదాయ ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు.

మిరపలో పంట కోత ప్రయోగం



చింతమానుపల్లెలో మిరప పంటలో ప్రయోగం చేపట్టిన వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లెలో మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మిరప పంటలో పంటకోత ప్రయోగం చేపట్టారు. గ్రామంలోని మాన్‌దొడ్డి పొలంలో 5''5 చదరపు మీటర్లలో ప్రయోగం చేపట్టగా 13 కేజీల దిగుబడి వచ్చిందని, ఇది సాధారణ దిగుబడి అని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, ఆర్బీకే మిత్ర దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కల్లూరు: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో జీవీ రమణమూర్తి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారిని గుర్తించి సకాలంలో అందించాలని సూచించారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

గూడూరు రూరల్: మండలంలోని సచివాలయాల్లో గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు కొరకు ఇబ్బందులు పడుతున్న వారు, చిన్న పిల్లల నమోదు, పేరు, అడ్రస్ మార్పులు, చేర్పులు వంటి వాటిని ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా పరిష్కరించనున్నామన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలను పొందాలని ఆమె సూచించారు.

23న నేతాజీ జయంతి

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు బుధవార పేట కేశవ మెమోరియల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త ధూపాటి మురళీధర చౌదరి తెలిపారు. కేశవ మెమోరియల్ పాఠశాల కరస్పాండెంట్ టి.గురప్ప, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత రాజశేఖర్‌లు ముఖ్య అతిథులుగా, వికాస భారతి సంఘటనా కార్యదర్శి బి.వి.నాగేంద్రప్రసాద్ ముఖ్య వక్తగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

గూడూరు రూరల్: గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని ఏపీఓ హసీనా పేర్కొన్నారు. కె.నాగలాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయన్నారు. కూలీలు దూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాది పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. పని అడిగిన వారందరికీ వెంటనే కల్పించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- దిగువపాడు, గీతాముఖర్జీనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



దిగువపాడులో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం దిగువపాడు, కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని గీతాముఖర్జీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పిస్తామన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారందరూ గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు పక్కా గృహాలు, ఇంటి వద్దకే వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. అంతేగాక సీఎం జగనన్న గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి పాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణవేణి, సచివాలయ కన్వీనర్ భద్రారెడ్డి, మాజీ సర్పంచ్ ఏసేపు, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

21న గానాల రామమూర్తి జయంతి

కర్నూలు(అర్బన్): విశ్వ బ్రాహ్మణుల పితామహుడు బ్రహ్మశ్రీ రావుసాహెబ్ పండిత గానాల రామమూర్తి 131వ జయంతి వేడుకలను ఈ నెల 21వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. బుధవారం స్థానిక బీసీ భవన్‌లో జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1892 జనవరి 21వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించిన గానాల రామమూర్తి విశ్వకర్మ జాతి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి విశ్వకర్మలు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బత్తుల లక్ష్మీకాంతయ్య, పార్వతమ్మ, వడ్ల శ్రీనివాసులు, బ్రహ్మయ్య, అయ్యన్నయాదవ్, చంద్రికమ్మ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు మండలంలో చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.34.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా ముందు జాగ్రత్తగా వేసవిలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా రూ.20లక్షలు కేటాయించామని తెలిపారు. అలాగే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. త్వరలోనే ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశానికి సంబంధించి సమాచారం ఇవ్వలేదని, గ్రామాల్లో అభివృద్ధి లేదని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పది రోజుల ముందుగానే మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు రిజిష్టర్ పోస్టు ద్వారా సర్క్యులర్ అందించామని, ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శులు స్వయంగా ఫోన్లు చేసి మరీ సమాచారం చేరవేశారని స్పష్టం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ నేతలకు ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. జనరంజక పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ముఖ్యమంత్రి చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, ఏపీఓ మహమ్మద్‌బాషా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు వీర బొమ్మ సత్యనారాయణ

గడివేముల: ఆర్యవైశ్యులందరూ కలిసి కట్టుగా ఉంటేనే మరింత అభివృద్ధి చెందుతామని ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు వీర బొమ్మ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన గడివేములలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో బుధవారం రాత్రి నూతనంగా ఎన్నికైనా మండల అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజకీయంగా ఆర్యవైశ్యులు ఎదగాలన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్యవైశ్య సంఘం తోడ్పాటు అందిస్తుందన్నారు. నూతన మండల అధ్యక్షుడు బొంతల మధుసూదనగుప్తా మాట్లాడుతూ..వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్తా, వాసవీ దీక్ష అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షులు సురేష్, కార్యదర్శి సీవీ రమణ, ఉపకార్యదర్శి సురేష్, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, రేవూరి మల్లికార్జున, సుమన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వేలంపాటలో పెరిగిన ఆదాయం



భోగేశ్వరాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గాభోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు బుధవారం నిర్వహించిన వేలంపాటలో ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళింగిరి పండ్లు అమ్ముకునేందుకు గతేడాది రూ.8800 ఉండగా ప్రస్తుతం రూ.10,500కు వేలంలో ఆదాయం వచ్చిందన్నారు. అలాగే చెరుకు అంగడి నిర్వహణకు గతంలో రూ.21,000 పోగా కొత్తగా రూ.27,000, ఐస్ కూల్‌డ్రింక్స్ అంగడి నిర్వాహణకు గతంలో రూ.26,000 ఉండగా రూ.29,500కు పాటదారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం వేలాల్లో రూ.66,200 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రవి కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఈ-క్రాప్'తో లాభాలెన్నో!

- పకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే పరిహారం
- ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వర్తింపు



బిలకలగూడూరులోని పొలంలో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గడివేముల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-క్రాప్(పంట నమోదు) బుక్కింగ్ రైతులకు వరంగా మారింది. పంట నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందుతోంది. పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా, పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలన్న, ఇతర పథకాలు, రాయితీలు వర్తించాలన్నా ఈ- క్రాప్‌లో నమోదు తప్పనిసరి. దీని వల్ల రైతులు ఏయే పంటలు సాగు చేశారు..ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలు తెలిసిపోతాయి. ఈ నేపథ్యంలోనే వ్యవసాయాధికారులు పంట నమోదును పకడ్బందీగా చేపడుతున్నారు.

16 వేల ఎకరాల్లో పంటల సాగు :

అన్నదాతకు ప్రభుత్వం విత్తు నుంచి పంట ఉత్పత్తులు అమ్ముకునేవారకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) ఏర్పాటు చేసి విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. మండలంలో 14 రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ అనంతరం వ్యవసాయశాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులను కలిసి పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు రబీలో దాదాపు 16 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అయినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. జొన్న 7 వేల ఎకరాలు, మొక్కజొన్న 6 వేల ఎకరాలు, వరి 800 ఎకరాల్లో, మినుము, సోయాబీన్ 2230 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు చెప్పారు

ప్రతి పంటను నమోదు చేస్తున్నాం



మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నాం. ఇప్పటి వరకు దాదాపు 16 వేల ఎకరాలలో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. పంట నమోదుకు రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలి. రబీలో సాగుచేసిన పంటలను స్థానిక రైతుభరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీంతో ప్రభుత్వం అందించే పథకాలు పొందడానికి సులభంగా ఉంటుంది.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

సచివాలయంలో చోరీ

కర్నూలు(టౌన్): కనుమ పండుగ రోజు నగరపాలక సంస్థ 95వ వార్డు సచివాలయంలో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. అయితే విషయాన్ని మున్సిపల్ అధికారులు గోప్యంగా ఉంచారు. సమాచారం మేరకు దుండగులు విలువైన సామాన్లను దొంగిలించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగినా ఇప్పటివరకు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

తాగుబోతుల వీరంగం...

81వ సచివాలయం పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం మత్తులో చెత్త వాహనాలను ధ్వంసం చేశారు. సచివాలయం బోర్డు, ఫ్లెక్సీలను తొలగించారు. బ్యానర్లను చింపివేశారు. సంబంధిత సచివాలయ ఉద్యోగులు బుధవారం నగర పాలక అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు నగరపాలక అధికారులు వెల్లడించారు.

ఆగిన జ్యోతిమాల్ లిఫ్ట్...

నగరంలోని జిల్లాపరిషత్ ఎదురుగా ఉన్న జ్యోతిమాల్ కాంప్లెక్స్‌లో ఉన్న లిఫ్ట్ బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఆగిపోయింది. కాంప్లెక్స్‌లో కొనుగోలు కోసం, షాపింగ్ చేసేందుకు వచ్చిన వినియోగదారులు జ్యోతిమాల్‌లోని మూడవ అంతస్తు నుంచి లిఫ్ట్‌లో కిందకు రావాలని ప్రయత్నించారు. 11 మంది ఉన్న ఈ లిఫ్ట్ 1వ అంతస్తు చేరుకుని ఒక్కసారిగా ఆగిపోయింది. అందులో ఉన్నవారు ఎంత ప్రయత్నించినా కదలలేదు. దీంతో వారు భయాందోళనకు గురయ్యారు. అందులో ఉన్నవారు సెల్‌ఫోన్ ద్వారా జ్యోతిమాల్ నిర్వాహకులకు ఫోన్ చేశారు. స్పందించిన యాజమాన్యం లిఫ్ట్ ఆపరేటర్లతో గంట పాటు ప్రయత్నించి ఎట్టకేలకు కిందకు దించారు. దీంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

హుండీ ఆదాయం రూ.4.90 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులో రూ.4.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ రఘురామ్, ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గడిచిన ఆరు నెలలకు సంబంధించి భక్తులు నగదు రూపంలో సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఈఓ తెలిపారు. ఈ మేరకు మొత్తం రూ.4,90,107లు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఆకుల మహేష్, నాగేశయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

- నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కర్నూలు (టౌన్): సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై గట్టి నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామాలను ఆయా పరిధిలోని పోలీసు అధికారులు సందర్శించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టాలని, ఫీల్డ్ వర్క్‌పై దృష్టి సారించాలని సూచించారు. పీటీ ట్రయల్ కేసుల్లో శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని అన్నారు. రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేయాలన్నారు. కిరాయి హంతకులు, దొంగల ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అక్రమ మైనింగ్, క్వారీస్, ఎక్స్‌ప్లోజివ్స్ ట్రాన్స్‌పోర్టు, రేషన్ బియ్యం అక్రమ తరలింపు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణ జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యువ కేసులు, గ్రేవ్ కేసులు, ఆస్తి నేరాల రికవరీ, పీటీసీఎస్‌ఓ కేసులు, ఎస్‌సీ, ఎస్‌టీ కేసులపై ఎస్పీ సమీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు వెంకటాద్రి, వెంకట్రామయ్య, యుగంధర్‌బాబు, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, నాగభూషణం, మహేష్, సీఐలు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతుల అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు

గూడూరు: పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్ఫూర్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో విజేతలకు బుధవారం స్థానిక అస్లామ్ కాంప్లెక్స్‌లో బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్నలు హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పండుగలు, పర్వదినాలలో ఆటల పోటీలు నిర్వహించడం వల్ల గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం బయటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తి రంగడు, ఎం.దుబ్బరాజు, దండు శ్రీను, సత్యాలు, క్రాంతిగౌడ్, కౌన్సిలర్లు దాస్, ఖలీల్, మదార్ సాబ్, నంద కిషోర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



లలితా సహస్రనామ కోటి పారాయణలలో పాల్గొన్న భక్తులు,(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకారంలో లలితా దేవి

కర్నూలు కల్చరల్: సద్గురు సాయినాథ్ ఉచిత యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ కోటి పారాయణ మహాయజ్ఞం కార్యక్రమం జరిగింది. సద్గురు భానుమతమ్మ ఆశీస్సులతో ఆమె శిష్యులు యోగా గురువు వుస్తేపల్లి పుల్లయ్య, వుస్తేపల్లి విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని పారాయణం చేశారు. యోగా గురువు పుల్లయ్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ యజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొనడం ఆధ్యాత్మిక ఐక్యతను చాటుతుందన్నారు. ముఖ్య వక్త భానుమతమ్మ మాట్లాడుతూ మనలో నిద్రాణమై ఉన్న దైవీ శక్తులను జాగృతం చేయడమే మానవ జీవితానికి పరమార్థమన్నారు. ధార్మిక శక్తితోనే శాంతి సుస్థిరత చేకూరుతుందన్నారు. యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలను కలిపి ఉంచేది ధర్మం మాత్రమే అన్నారు. అటువంటి ధర్మకార్యాలు చేయడం అభినందనీయమన్నారు. లలితా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.జ్ఞానేశ్వరమ్మ, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, అమ్మవారిశాల అధ్యక్షులు రాజశేఖర్, సభ్యులు రమేష్, సుకన్య, లక్ష్మి, హరిప్రియ, రమేష్, శీను, వేదవతి, వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం అధ్యక్షులు నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి గ్రైడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్యా కార్తీక్, తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో వేగం పెరగాలి

- కలెక్టర పి.కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రేరీల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పీఆర్ అధికారులను ఆదేశించారు. బల్క్‌మిల్క్, డిజిటల్ లైబ్రేరీల నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయడం కోసం కార్యచరణను రూపొందించుకోవాలన్నారు. జిల్లాకు 458 సచివాయాలు మంజూరైతే ఇప్పటి వరకు 134 భవనాలు పూర్తయ్యయన్నారు. అలాగే 447 రైతు భరోసా కేంద్రాల మంజూరైతే 73 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన భవనాలు వివిధ దశలో ఉన్నాయన్నారు. అలాగే జిల్లాకు 354 వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా కేవలం 24 మాత్రమే పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'ఫుడ్ పాయిజన్ అవాస్తవం'

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ)లో ఫుడ్ పాయిజన్ అయినట్లు జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని ఆ సంస్థ ఉన్నతాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ ఐటీలో 650 మంది విద్యార్థులు, 100 మంది సిబ్బంది రోజు భోజనం చేస్తున్నారని, క్యాంపస్‌లోని స్టోర్ రూం, వంటగది, డైనింగ్ హాలులో అన్ని ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను అమలు చేస్తున్నామన్నారు. అదే విధంగా క్లోరినేషన్‌తో కూడిన శుద్ధ జల ప్లాంటు ఉందని, వైద్య సేవలు అందించేందుకు మెడికల్ యూనిట్, అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. సంస్థకు సంబంధించిన వారితో మాట్లాడకుండా ఎలాంటి వాటిని ప్రచారం చేయకూడదని వారు కోరారు.